


# 15

ఆంగ్ల మూలం :
తయేన్‌జమ్ బిజోయ్‌కుమార్ సింగ్


తెలుగు అనువాదం :
కొల్లూరి సోమశంకర్

# ఎవరు ఏమైపోతే మాకేం?

ఎన్నాళ్ళనుంచో ఎదురు చూస్తున్న వర్షాలు పేదలు, గూడు లేని అభాగ్యులని శిక్షిస్తూ, ఒక్కసారిగా ఉధృతంగా వచ్చాయి. ఈ జడివానల ధాటికి తలవంచి, సూర్యుడు ఎక్కడో దాక్కున్నాడు. ఎటు చూసినా తడి, చెమ్మ. అయితే ఈ వానలు 'సాఖి' ఉత్సాహాన్ని మాత్రం నీరు కార్చలేకపోయాయి. ఆమె వంటింట్లో పొయ్యి వెలిగించడానికి ప్రయత్నిస్తోంది. ఇంట్లో మిగిలిన ఆ గుప్పెడు బియ్యాన్ని వండి, పిల్లలకి కనీసం తలా ఒక ముద్ద అన్నమైనా పెట్టి నిద్రపుచ్చాలని ఆమె తపన. వానలో తడిసిన కర్రపుల్లలని పొయ్యిలోకి తోస్తూ, నిప్పు రాజేయడానికి గుండెల నిండా ఊపిరి పీల్చుకుని గొట్టంలోంచి గట్టిగా గాలి ఊదుతోంది. అంత చిన్న పని సైతం ఇప్పుడామెకి భగీరథ ప్రయత్నమైంది.

వీపుకి కట్టుకున్న ఆమె చిన్నకొడుకు ఏడుపు ఆపడమే లేదు. అంత పనిలోను ఆమెకి నవ్వొచ్చింది. వాడిని

సముదాయించలేదు, నిప్పు రాజేయడం ఆపనూ లేదు! ఆమె లేచి ఓ బకెట్ లోంచి ధాన్యం పొట్టుకొంత తీసి పొయ్యిలో వేసింది. ఓ చిన్న కర్రపుల్లకి నిప్పంటించి, ధాన్యం పొట్టు పై పడేసింది. ఆ వేడికి కర్రపుల్లల్లోని తేమ ఆవిరైపోయింది. క్రమంగా మంట పెద్దదై అన్ని కర్రలనూ అంటుకుంది. సాఖి చిన్నగా నిట్టూర్చి, మసిబారిన ఓ అల్యూమినియం వంటపాత్రని పొయ్యిపై పెట్టింది.




టప్.... టప్..... టప్

చినుకులు తుప్పు రేకులమీదపడి, క్రిందకి జారి సాఖి ఉంచిన బకెట్లు, గిన్నెలు, తపేళాలలో తిన్నగా పడుతున్నాయి. పొయ్యి వెలిగించే ప్రయత్నంలో ఉండి, ఆమె గిన్నెలలో చేరిన నీటి సంగతి గమనించలేదు. పాత్రలన్నీ నిండిపోయి, నీళ్ళు నేలమీదకి కారుతున్నాయి. వర్షం వల్ల అసలే చెమ్మగా ఉన్న నేల ఈనీటి ప్రవాహంతో మరింత చిత్తడిగా మారింది. ఆమె గబగబా లేచి ఆ పాత్రలలోని నీటిని బయట పారబోసి, గిన్నెలని యధాస్థానంలో ఉంచింది. తర్వాత ఓ పాతగుడ్డతో నేలను తుడిచింది. ఇంతలో బయటనుంచి ఎవరో ఆమెని పిలిచారు.

"అక్కా, సాఖి అక్కా"

ఆ గొంతు ఎవరిదో పోల్చుకోలేక, చేస్తున్న పనిని ఆపి మరింత శ్రద్ధగా వినడానికి ప్రయత్నించింది.

"అక్కా, సాఖి అక్కా ఈ పూట తొందరగా నిద్రపోయావా ఏంటి?"

ఈసారి ఆమె ఆ గొంతుని పోల్చుకుంది. ఆమెకి తమ్ముడి వరసయ్యే 'అనౌ' ది ఆ గొంతు.

"లేదు. మెలకువగానే ఉన్నాను. వంటింట్లో ఉన్నాను. గడియతీసే ఉంది. లోపలికి రా"

అనౌ లోపలికి వచ్చాడు. సాఖి నేలను తుడవడం ఆపి, ఒకపాత వెదురు స్టూలుని తెచ్చి వేసింది. తన ఇంటి పరిస్థితి పట్ల ఆమెకి సిగ్గుగా ఉంది.

"నువ్వు వస్తావని ఊహించలేదు. మొదటి సారిగా మాఇంటికి వచ్చావు. పైగా వేళకాని వేళ ! ఏమిటి విషయం ?" అని అడిగింది.

అనౌ ఏమీ మాట్లాడలేదు. స్టూలుమీద కూర్చుని గదంతా పరికించి చూసాడు. వాన చినుకులు కారుతున్న ఒకే ఒక రేకుల గదిని తమ ఇల్లని చెప్పుకోడం ఎవరికీ గర్వంగా ఉండదు. సాఖి ఆ గదిలోనే ఒకమూల వంట చేస్తోంది. మరోమూల ఇద్దరు పిల్లలు ! ఆడపిల్లకి సుమారు ఐదేళ్ళు ఉండచ్చు. ఆ పిల్ల తన పెద్ద తమ్ముడితో పాటు కూర్చుని ఉంది. అమాయకమైన చూపులతో పిల్లలిద్దరూ అతిథిని దీనంగా చూస్తున్నారు. వెంటనే వారి కళ్ళలోని ఆకలిని పసిగట్టాడు అనౌ. అక్క వీపుపై ఉన్న మరో పిల్లాడిని గమనించాడు.

"అయితే నీకు ముగ్గురు పిల్లలన్న మాట ! కానీ వీళ్ళ కోసం నేనేమీ తీసుకురాలేదు...."

"పర్వాలేదులే. రోజంతా ఏదో ఒకటి నములుతూండడం తప్ప వీళ్ళకి వేరే పనేం లేదు. ఇప్పుడే ఓ పాకెట్ బిస్కట్లు లాగించారు. అయినా వీళ్ళకి ఎప్పుడూ ఆకలే..."

అందంగా అబద్ధమాడినా, పిల్లలకి కనీసం రెండు పూటలైనా తిండి పెట్టలేని తన అశక్తతని, పేదరికాన్ని లోలోపలే తిట్టుకుంది సాఖి.

సాఖి భర్త 'టోనూ' ట్రక్ డ్రైవర్. గౌహతి నుంచి ఇంఫాల్ వరకు సరుకుల లోడ్ తీసుకుని నేషనల్ హైవే పైన తిరుగుతుంటాడు. టోనూ బాల్యంలోనే తల్లిదండ్రులను పోగొట్టుకున్నాడు. పెళ్ళయి ఎక్కడో దూరంగా కాపురం చేసుకుంటున్న ఓ అక్క తప్ప టోనూకి వేరే బంధువులెవ్వరూ లేరు. ఇటు తనవైపు కూడ సాఖికి ధనవంతులైన చుట్టాలు లేరు. ఆమె అమ్మానాన్నలకి రెక్కాడితే గాని డొక్కాడదు. ఆమె తమ్ముళ్ళింకా చదువుకుంటూనే ఉన్నారు.

భర్త సంపాదించే కొద్దిపాటి జీతంతోను బ్రతకడం కష్టంగానే ఉంది. పిల్లలు ఇంకా చిన్నవాళ్ళే కావడంతో సాఖి బయట పనులకి వెళ్ళలేకపోతోంది. అలా అని ఆమె ఖాళీగా ఉండదు. ఇంటి చుట్టూ చిన్న పాదులు వేసి, తోటలా చేసింది. ఆకు కూరలు, కూరగాయలు పండించి, ఇంటి ఖర్చుని కొంతైనా తగ్గించగలిగింది. స్వెటర్లు అల్లుతూ కొద్దో గొప్పో సంపాదిస్తుంది. కానీ ఈ వానలకి తోట పాడై పోయింది. చలికాలం రావడానికి ఇంకా చాలా రోజులున్నాయి కాబట్టి స్వెటర్లకి ఆర్డర్లేమీ లేవు. భర్త ఇచ్చే ప్రతీ పైసా జాగ్రత్తగా లెక్కిస్తుంది సాఖి.

నేషనల్ హైవే మీద ఎంతో కాలంగా కొనసాగుతున్న ఓ 'రాస్తారోకో' వల్ల టోనూ ఆదాయం కుంటుపడడమే కాక, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. కొన్ని సరుకులైతే మార్కెట్లోంచి మాయమైపోయాయి. ఎంత ధర పోసైనా కొనుక్కోగలిగే వాళ్ళకి మాత్రం నల్లబజారులో దొరుకుతున్నాయి.

"నేను ఇప్పుడే గౌహతి నుంచి బస్‌లో వచ్చాను. ఈ రాస్తారోకో వల్ల రెండు గంటలకి పైగా ఆలస్యమైంది. స్టేట్ బోర్డరు దగ్గర పోలీసు ఎస్కార్టు కోసం ఎదురు చూడడం వల్ల మరీ ఆలస్యమైంది. అక్కడే బావ కలిసాడు. పాపం ఆ ప్రాంతంలో చిక్కుకు పోయి రెండు రోజులవుతోందట ! నీ గురించి పిల్లల గురించి బెంగపెట్టుకున్నాడు" చెప్పాడు అనౌ.

"ఎప్పుడొస్తాడట?"

"తెలీదు. కనీసం 50-60 ట్రక్కులు ఆగిపోయి ఉన్నాయి. పోలీసులు ఒకసారి నాలుగు లేదా ఐదు ట్రక్కులకి రక్షణనివ్వగలరు. పైగా ప్రయాణీకుల బస్సులకి ప్రాధాన్యతనిస్తున్నారు...."

" ఈ రాస్తారోకో ఇంకా ఎన్నాళ్ళు ? తమ స్వార్ధపరమైన కోర్కెల కోసం ప్రజలని ఎంతగా ఇబ్బందుల పాలు చేస్తున్నారో ! ఎవరు ఏమైపోతే మాకేం అనుకునే దుర్మార్గులు...."

"దేవుడికే తెలియాలి, ఈ రాస్తారోకో ఎప్పటికి ముగుస్తుందో. కాని ఒకటి మాత్రం చెప్పగలను - ఇప్పట్లో మాత్రం ఆపరు...." అంటూ రెండు వంద రూపాయల నోట్లుతీసి సాఖికి అందించాడు.

"బావ ఈ డబ్బులు నీకివ్వమన్నాడు. అందుకే ఇక్కడికి వచ్చాను"

సాఖి ముఖం వెలిగిపోయింది. డబ్బు చేతిలో ఉంచుకుని అనౌకి కృతజ్ఞతలు చెప్పింది.

"నాకు డబ్బివ్వడానికి నువ్వంత దూరం నుంచి వచ్చావు. నేను నీకు కనీసం ఓ కప్పు టీ కూడ ఇవ్వలేకపోతున్నాను. ఏమనుకోకు"

"పర్వాలేదు. అయినా ఇది టీ తాగే సమయం కాదు. ఇప్పటికే ఆలస్యమైంది. మా ఇంట్లో నా కోసం ఎదురు చూస్తూంటారు...." అంటూ అనౌ లేచి వడివడిగా బయటకు కదిలాడు.

✿ ✿ ✿

అనౌ వచ్చి వెళ్ళాకా, రెండు రోజులు గడిచి పోయాయి. మూడోరోజు సాయంకాలమైంది. మరో రోజు కూడా ముగిసిపోతోంది. కానీ టోనూ ఇంకా

ఇంటికి చేరలేదు. సాఖి మనసంతా అశాంతిగా ఉంది. పెరట్లోని తులసిమొక్క ముందు మోకాళ్ళపై కూర్చుని ఓ చవకరకం అగరబత్తిని వెలిగించింది. పెద్ద పిల్లలిద్దరూ మౌనంగా తల్లి వెనకాల చేరారు. చిన్నాడు అమ్మ వీపుకే వేలాడుతున్నాడు. వెలిగిన అగరబత్తిని నేలకి గుచ్చి, పక్కనే ఓ దీపాన్ని వెలిగించింది. ధూపం పరిమళం ఆ ప్రాంతాన్ని పవిత్రం చేసింది. కుటుంబమంతా కలసి సాయంత్రపు ప్రార్ధనని పూర్తి చేసారు. ఎన్నాళ్ళ నుంచో కొనసాగు తున్న ఈ సాంప్రదాయాన్ని సాఖి ఇప్పటికీ పాటిస్తుంది.

ప్రార్ధన ముగించి కళ్ళు తెరవగానే తమ ఇంటివైపు ఎవరో రావడం కనిపించిందామెకు. లేచి నిలుచుంది. దగ్గరయ్యేసరికి ఆ ఆకారం ఆమెకి సుపరిచితమే! ఆ వచ్చింది 'ఎబోంచా'. టోనూ అసిస్టెంటు. టోనూతో పాటు లారీలో ఊళ్ళు తిరుగుతుంటాడు.

అతడు ఒంటరిగా రావడం, అతడి ముఖంలో ఆందోళన చూసి కంగారు పడింది సాఖి.

వణుకుతున్న గొంతుతో..... "వదినా" అని మాత్రం అనగలిగాడు ఎబోంచా. ఏదో చెప్పాలనుకుంటున్నాడు, కాని మాటలు పెగలడం లేదు.

"ఏమైందో చెప్పు ! మీ అన్న ఎక్కడ ?"

ఎబోంచా ఏమీ మాట్లాడక మౌనంగా ఉండి పోయాడు. కొన్ని క్షణాల తర్వాత శక్తి కూడదీసుకుని, "ఓ దుర్వార్త మోసుకొచ్చా వదినా ! అన్నకి యాక్సిడెంటయ్యింది" అని చెప్పాడు.

"ఏంటి యాక్సిడెంటా ? దెబ్బలు బాగా తగిలాయా ? ఇప్పుడెలా ఉన్నాడు?" ఆతృతగా అడిగింది సాఖి.

"అన్న మనకిక లేడొదినా.... పైకెళ్ళి పోయాడు...." అంటూ భోరుమన్నాడు ఎబోంచా.

సాఖికి ఒక్కసారిగా తల తిరిగింది. నేలమీద కూలబడిపోయింది. ఎబోంచా చెబుతున్నది ఆమె చెవికెక్కడం లేదు.

"పోలీసు జీపుల వెంటే మా ట్రక్‌ని నడిపాం. అన్న నడుపుతున్నాడు. నేను పక్కనే కూర్చుని ఉన్నాను. కొండదారిలో ఒక మలుపు దగ్గర అడవిలో కొందరు దాక్కుని మా మీదకి రాళ్ళు విసిరారు. రాళ్ళ దెబ్బలకి లారీ అద్దాలు పగిలిపోయాయి. ఓ రాయి తగిలి అన్నకి కాసేపు కళ్ళు కనిపించలేదు. అంతే లారీ అదుపుతప్పి, ఓ పెద్దలోయలోకి జారిపోయింది. ఇదంతా నాకు స్పృహ తప్పకముందు జరిగిన సంఘటన.....

నేను కళ్ళు తెరిచేసరికి జిల్లా ఆసుపత్రిలో మంచంపై ఉన్నాను. లారీ ఓనరు, కొంతమంది పోలీసులు ఉన్నారక్కడ. ఓ పోలీసు నా స్టేట్‌మెంట్ తీసుకున్నాడు. ఆ తర్వాతే చెప్పారు - ఆ ప్రమాదంలో అన్న చనిపోయాడని !"

సాఖి ఇంకా దిగ్భ్రాంతి స్థితిలోనే ఉంది. ఎబోంచా చెప్పేదేమీ వినడం లేదు. పొంగివస్తున్న దుఃఖోద్వేగాన్ని అణచుకోడానికి ప్రయత్నిస్తోంది. ఆమె మానసిక స్థితిని గమనించని ఎబోంచా ఇంకా చెప్పుకు పోతున్నాడు.

"నాకు ప్రథమ చికిత్స చేసి, చిన్న చిన్న గాయాలకు పట్టీలు వేసారు. నీకీ వార్త తెలియజేయమని ఓ జీపులో ఇక్కడికి పంపారు. అధికారులింకా అక్కడే ఉన్నారు. ఏవో కాయితాల పనులు పూర్తి చేసి, శవపరీక్ష అయ్యాక అన్న శరీరాన్ని తీసుకొస్తారట. వాళ్ళు ఏ క్షణంలోనైనా రావచ్చు..."

తండ్రిని కోల్పోయిన పిల్లలనిదగ్గరికి తీసుకుని హత్తుకుంది సాఖి. ఆమె వీపు పై పిల్లాడు ఏదో అర్ధమైనట్లుగా నిశ్శబ్దంగా ఉండిపోయాడు. అలా ఎంతసేపు ఉండిపోయిందో ఆమెకి తెలియలేదు. అప్పటికే చాలా చీకటి పడింది. కొంతసేపటికి ఓ వాహనం వచ్చి ఇంటిముందు ఆగింది. దాని హెడ్‌లైట్ల వెలుగులో ఎబోంచా ఇంకా అక్కడే నిలబడి ఉండడం కనపడింది. కొన్ని క్షణాల తర్వాత ఓ వ్యక్తి లాంతరు పట్టుకుని లోపలికి వచ్చాడు. ఆ వెనుకే నలుగురు మనుషులు తెల్లటివస్త్రంతో కప్పిన శవపేటికని మోసు కొచ్చారు. ఏమాత్రం చప్పుడు చేయకుండా, నిశ్శబ్దంగా క్రిందికి దించారు. వాళ్ళల్లోంచి ఒకరు, టోనూ ముఖాన్ని చూడడానికి వీలుగా, శవంపై గుడ్డని కొద్దిగా తొలగించారు. ఆ లాంతరు వెలుతురులో టోనూ ముఖం ప్రశాంతంగా నిద్రపోతున్నట్లుగా ఉంది.

కాసేపటి తర్వాత, ఆ స్మశాన నిశ్శబ్దాన్ని ఆమె పెద్దకొడుకు తన ప్రశ్నతో భగ్నం చేసాడు.

"అమ్మా, నాన్నెందుకు పెట్టెలో పడుకున్నాడు?"

## నమ్మలేని నిజాలు

కృష్ణాజిల్లా కాంగ్రెసు కమిటీకి మొదటి అధ్యక్షుడు ముట్నూరి కృష్ణారావుగారు, కార్యదర్శి పట్టాభిగారు. రెండవ అధ్యక్షుడు గొట్టిపాటి బ్రహ్మయ్యగారు. ఇక్కడే ఒక విచిత్ర సంఘటన జరిగింది. పై ఇద్దరూ అప్పటికి ప్రముఖ నాయకులే అయినా - ఒకే వర్ణం వారు. అలా వుండటం వారికి ఇష్టం లేకపోయింది. ఇద్దరూ ఆలోచించుకొని అధ్యక్షపదవి నుంచి ముట్నూరి వారు తప్పుకుని గొట్టిపాటి బ్రహ్మయ్యగారిని ప్రతిపాదించాలనీ, కార్యదర్శిగా పట్టాభిగారే కొనసాగుతారు కనుక అన్ని వ్యవహారాలూ సజావుగానే కొనసాగిపోతుంటాయని ఊహ. ఆ విధంగా యువకులను నాయకత్వంలోకి తీసుకురావాలని ఆంతర్యం. ఈ విషయాన్ని బ్రహ్మయ్యగారి వద్ద పట్టాభిగారు ప్రస్తావించగా "పంతులుగారి స్థానంలో నేను రావటమేమిటి? నేను కార్యకర్తగానే చిన్నపాటి నాయకుణ్ణి కూడా కాదు గదా ! అలాంటివారు ఇంకా చాలా మంది ఉన్నారు. నాకు ఏ పదవీ వద్దు. కేవలం కార్యకర్తగానే మిమ్ములను అనుసరిస్తూ పార్టీకి సేవ చేస్తాను. కానీ ఇలా పోటీ మాత్రం చేయను ! అని అన్నారట. ఇద్దరూ కలిసి ఎంత నచ్చచెప్పినా లాభం లేకపోయింది. చివరకు ఎన్నిక సమయంలో తానే ముందుగా అధ్యక్షస్థానానికి ముట్నూరికృష్ణారావుగారి పేరును ప్రతిపాదించారు. అప్పుడు కృష్ణారావు గారు లేచి ఆ స్థానానికి బ్రహ్మయ్యగారిని ప్రతిపాదించగా - పట్టాభిగారు బలపర్చారు. ఇద్దరు అభ్యర్ధులైనందుకు ఏకగ్రీవం కావాలసిన ఎన్నిక పోటీ జర్గిగి వోటింగు దాకా వెళ్ళింది. ఫలితం - బ్రహ్మయ్యగారి ప్రతిపాదన వీగిపోయింది. కృష్ణారావుగారి మాటే నెగ్గింది. ఇక బ్రహ్మయ్యగారికి అధ్యక్షునిగా ఉండక తప్పలేదు. ఇది గెలుపా ? ఓటమా ? ఆ ప్రసక్తి అక్కరలేదు. ఆయన పదవిలో ఉన్నంతవరకూ ఆ ఇద్దరి సలహాల మేరకే నడుచుకొనే వారట. అదీ - ఆనాటి ఎన్నికల విధానం. ఇప్పుడూ ఆ పద్ధతే ఉంటే ? - ఈ సంగతి వింటుంటే పూర్వం ధర్మరాజుగారి వద్దకు భూగర్భ సంపద విషయమై అమ్మినవారికీ, కొన్నవారికి మధ్యన వివాద ఘట్టం గుర్తుకు వచ్చింది. అసలు ఈ కథను చెప్పింది మండలి బుద్ధప్రసాద్‌గారు. తాము డి.సి.సి ప్రెసిడెంటుగా వచ్చిన కొత్తలో ఈ విషయాన్ని విన్నారట. ఆనాటి విలువలను కాపాడి మంచిపేరు తెచ్చుకోటానికి నాయకులు ఎంత చిత్తశుద్ధితో కృషి చేయాలో అర్థం చేసుకున్నానన్నారు.

- సేకరణ : జి.వి.ఆర్.కె. సుబ్బరాయమూర్తి